క్లుప్తంగా

జేపీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొత్తూరు: షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి సోమవారం మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఉన్న జేపీ దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాలో నిర్వహించే ఉర్సుకు జేపీదర్గా నుంచి తీసుకెళ్లనున్న చాదర్‌కు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం



కరుణాకర్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్‌హాలులో సోమవారం తాలుకా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు మేడిగ పెంటయ్య ఆధ్వర్యంలో సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన త్రిప్పిశెట్టి కరుణాకర్‌కు సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్నూరుకాపు మహాసభ కాచిగూడ హైద్రాబాద్ కార్యదర్శి మంచిరేవుల సాయికృష్ణ హాజరై మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు నారాయణ, మల్చలం మురళి, శ్రీశైలం, గంధం ఆనంద్, శ్రీనివాస్, దర్శన్, అశోక్, రాము, హరి భూషణ్, భాస్కర్, పల్లె విజయ్, శ్రీశైలం, రాజు, భాస్కర్, కృష్ణ, సురేశ్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి
మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి



జైపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, రైతులు

మొయినాబాద్‌రూరల్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ద్వారా తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్ కొత్త జైపాల్ రెడ్డి అన్నారు. సోమవారం డైరెక్టర్ ప్రమాణస్వీకారం సందర్భంగా అజీజ్‌నగర్ గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో అజీజ్‌నగర్ మాజీ సర్పంచ్ మంగలి మంగరాములు, కొత్త మల్ రెడ్డి, రాజిరెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

కొందుర్గు: మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి సోమవారం బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి గుండేటి శివారెడ్డి మాట్లాడుతూ.. రైతులకు కేంద్ర ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి రూ.6 వేల నుంచి రూ.10వేలకు పెంచడం, డీఏపీ ధరలు పెరిగినప్పటికీ రైతులకు రూ.1350లకే అందించడం అభినందనీయమన్నారు. ఇందుకుగాను కేంద్ర కేబినేట్ ఆమోదం తెలుపుతూ తీర్మానం చేయడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు లక్ష్మయ్యగౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, అశోక్, అంజయ్య, సుధాకర్, చంద్రశేఖర్, పులిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

కొందుర్గు: గ్రామాల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం కొందుర్గు ఎంపీడీఓ లక్ష్మీ అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజాపాలనలో పేద ప్రజలు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కనిపించడం లేదన్నారు. దీంతో ఇల్లు లేని పేదలకు ఇళ్ల సర్వేలో అధికారులు ఫొటోలు తీయడం లేదన్నారు. అధికారులు స్పందించి అర్హులైన పేదల నుంచి తిరిగి దరఖాస్తులు స్వీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాగ్గళ్ల నర్సింహ, నాయకులు సురేశ్, లక్ష్మయ్య, రాములు, సునిత పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై ధరాభారం

ధరల పెరుగుదల ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై ప్రభావం చూపుతోంది. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఆకలి వెతలు తీర్చడానికి ప్రభుత్వం మధ్యాహ్న భోజనాన్ని ప్రవేశపెట్టింది. కానీ ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం సిద్ధం చేయడానికి పెరిగిన కూరగాయలు, గుడ్లు, నిత్యావసర ధరలతో వంట ఏజెన్సీలు అవస్థలు పడుతున్నారు.

- మెనూ అమలుకు ఇబ్బందులు
- పెరిగిన ధరలతో గిట్టుబాటు కావడం లేదంటున్న ఏజెన్సీలు
- పలు మార్పులతో భోజనం ఏర్పాట్లు



మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు చదువుతో పాటు వారు శారీరకంగా దృఢంగా మారడానికి ప్రభుత్వం మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తోంది. ఇటీవల పథకంలో పలు మార్పులు చేసిన ప్రభుత్వం ప్రతీ విద్యార్థికి నాణ్యమైన భోజనం అందించే విధంగా మెనూను ఏర్పాటు చేసింది. కాగా అడ్డూ అదుపు లేకుండా పెరిగిన కూరగాయల ధరలు విద్యార్థుల పాలిట శాపంగా మారాయి. కూరగాయలు, కోడిగుడ్ల ధరలు ఒక్కసారిగా పెరగడంతో వంట ఏజెన్సీలు మెనూను అమలు చేయడం కష్టంగా మారుతోందని వాపోతున్నారు. కొత్తూరు మండలంలో 28 ప్రాథమిక, 05 ప్రాథమికోన్నత 05 ఉన్నత, ఒక కస్తుర్బాగాంధీ బాలికల పాఠశాలలు కొనసాగుతున్నాయి. అన్ని పాఠశాలల్లో సుమారుగా 2,550 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

బిల్లుల చెల్లింపులు ఇలా..

ప్రస్తుతానికి ప్రభుత్వం మధ్యాహ్న భోజనం కోసం 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి 6.19 రూపాయలు, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 9.29 రూపాయల బిల్లులను వంట ఏజెన్సీలకు చెల్లిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం పౌర సరఫరాల నుంచి బియ్యాన్ని పంపిణీ చేస్తుంది. కాగా ప్రభుత్వం ఇచ్చే ధరలు గిట్టుబాటు కాకపోవడం, దానికి తోడు విపరీతంగా పెరిగిన నిత్యావసరాల ధరలతో ఏజెన్సీలు ప్రభుత్వం అమలు చేస్తోన్న మెనూను పాటించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మెనూలో పలు మార్పులు..

ప్రస్తుతం పెరుగుతున్న ధరల కారణంగా అన్ని పాఠశాలల్లో ఏజెన్సీలు మెనూలో కొన్ని మార్పులు చేస్తున్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం.. సోమవారం కిచిడి, మిశ్రమ కూరగాయల కూర, కోడిగుడ్డు, మంగళవారం అన్నం, మిశ్రమ కూరగాయల కూర, సాంబార్, బుధవారం అన్నం, మిశ్రమ కూరగాయాల కూర, ఆకుకూర పప్పు, కోడిగుడ్డు, గురువారం వెజిటేబుల్ బిర్యాని, మిశ్రమ కూరగాయాల కూర, శుక్రవారం అన్నం, మిశ్రమ కూరగాయాల కూర, సాంబర్, కోడిగుడ్డు, శనివారం అన్నం, మిశ్రమ కూరగాయల కూర, ఆకుకూర పప్పు, ఇవ్వాలి. వారంలో మూడు రోజులు కోడిగుడ్డు అందించాల్సి ఉండగా కొన్ని చోట్ల రెండుసార్లు, మరికొన్ని చోట్ల ఒక్కసారితోనే సరిపెడుతున్నట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. కోడిగుడ్డు ధరలు పెరిగినప్పుడు అరటి పండ్లను అందిస్తున్నారు.



కొత్త మెనూ పట్టిక

అధికారులు పర్యవేక్షించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, ఎస్‌ఎంసీ సభ్యులతో పాటు సంబంధిత శాఖ అధికారులు తరచూ పర్యవేక్షించాలి. అప్పుడే భోజనం నాణ్యతగా ఉంటుంది. కానీ పర్యవేక్షణ లోపిస్తే మెనూ సక్రమంగా అమలు చేయరు.

– నరేశ్‌చారి, విద్యార్థి సంఘం నాయకుడు

మెనూ పాటిస్తున్నాం



వంట ఏజెన్సీలు తప్పకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూను పాటించాలి. మెనూ ప్రకారం కోడిగుడ్లు ఇవ్వని పక్షంలో దానికి బదులుగా అరటి పండ్లను అందించడం జరుగుతుంది. మండలంలోని అన్ని పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేసిన కొత్త మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందిస్తున్నాం.

– అంగూర్‌నాయక్, ఎంఈఓ, కొత్తూరు

మున్సిపాలిటీ వద్దు.. జీపీలే ముద్దు



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విలీన గ్రామాల నాయకులు

కలెక్టర్‌కు విలీన గ్రామ నాయకులు వినతి

మొయినాబాద్: మున్సిపాలిటీ ఏర్పాటు వద్దు.. గ్రామ పంచాయతీలే ముద్దు అంటూ మండలంలోని ఏడు విలీన గ్రామ పంచాయతీల నాయకులు కలెక్టర్ నారాయణరెడ్డికి విన్నవించారు. ఈ మేరకు సోమవారం వారందరూ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలం పూర్తిగా గ్రామీణ ప్రాంతంగా ఉందని, గ్రామ పంచాయతీలను ఇప్పుడే మున్సిపాలిటీ చేయాల్సిన అవసరం లేదని కలెక్టర్‌కు వివరించారు. మున్సిపాలిటీలో విలీనం చేసే చిలుకూరు, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, ఎన్కేపల్లి, పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్ గ్రామ పంచాయతీల పరిధిలో వ్యవసాయ భూమే అధికంగా ఉందన్నారు. మున్సిపాలిటీ చేయడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. మున్సిపాలిటీ చేసే ఏడు పంచాయతీలు 111 జీఓ పరిధిలోనే ఉన్నాయని, ఈ జీఓ నిబంధనల ప్రకారం ఇప్పటికే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీఓ విషయంలో స్పష్టత ఇవ్వకుండా మున్సిపాలిటీ చేయొద్దన్నారు. ప్రస్తుతానికి గ్రామ పంచాయతీలుగానే కొనసాగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వివిధ పార్టీల నాయకులు గరుగు రాజు, పాటి జగన్‌మోహన్‌రెడ్డి, జకరయ్య, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేద్దాం

ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభివృద్ధికి అందరం కృషి చేద్దామని మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట పీఆర్టీయూ టీఎస్ మండల కేలండర్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం పీఆర్టీయూ మండల అధ్యక్షుడు జక్కని బందయ్య ఆధ్వర్యంలో నిర్వహించగా మండలంలోని సంఘం సభ్యులు పాల్గొని కేలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, హమీద్, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, నరేందర్, సంజీవ్‌కుమార్, అరుణ్‌కుమార్, బీమ్లా, మంజుల, వేణు, రాంచంద్రయ్య, కవిత, ఉమారాణి పాల్గొన్నారు.

కేలండర్, డైరీ ఆవిష్కరణ

షాబాద్: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద పీఆర్టీయూ టీఎస్ కేలండర్‌తో పాటు డైరీ, ఉపాధ్యాయుల ఐడీ కార్డులను సోమవారం మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్‌నాయక్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు ఐడీకార్డులు అందించడానికి మర్పల్లి అశోక్ మెరియా ముందుకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో



షాబాద్: కేలండర్, డైరీ, ఐడీకార్డులు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, సభ్యులు

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్‌రెడ్డి, కృష్ణ, గౌరవ అధ్యక్షుడు అంజయ్య, రాష్ట్ర బాధ్యులు, మండల బాధ్యులు తదితరులు ఉన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: పీఆర్టీయూ టీఎస్ 2025 కేలండర్‌ను సోమవారం చౌదరిగూడ మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఎస్ రద్దుకు పీఆర్టీయూ ఎంతగానో కృషిచేస్తుందన్నారు. పీఆర్టీయూ ఎప్పుడు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు విద్యాభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి, గౌరవాధ్యక్షుడు రాఘవేందర్, ఎంఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి, చౌదరిగూడ కాంప్లెక్స్ హెచ్‌ఎం సునిత, మండల కమిటీ అధ్యక్షుడు సురేశ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ సంధ్య, సంఘం సభ్యులు


నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కేశంపేట: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ అజాంఅలీ తెలిపారు. లబ్ధిదారులు ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దకు రావాలని ఆయన కోరారు.

రైతు భరోసా వెంటనే అందించాలి

షాబాద్: ప్రభుత్వం రైతులకు వెంటనే రైతు భరోసా అందించాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భారతీయ కిసాన్ సంఘ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు భరోసా అమలుపై రైతులను గందరగోళానికి గురిచేస్తుందన్నారు. ఇప్పటికే రైతు భరోసా డబ్బులు అందించాల్సి ఉండగా, దానిపై ఇంకా ప్రభుత్వం క్లారిటీ ఇవ్వడం లేదన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా త్వరగా రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, సభ్యులు రామస్వామి, చంద్రబాబు, సత్యంగౌడ్, పాండుగుప్తా, రైతులు తదితరులు ఉన్నారు.

కళాశాలలో వసతులు కల్పించాలని వినతి



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.మహిపాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ వెంకటరామారావుకు ఏబీవీపీ నాయకులతో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కళాశాలలో చదువుకుంటారని, వారికి కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. టాయిలెట్స్ ఉన్న వాటిని శుభ్రం చేసేందుకు సిబ్బంది లేకపోవటంతో అపరిశుభ్రంగా మారుతున్నాయని ఆరోపించారు. విద్యావ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యం వీడి వెంటనే కళాశాలలో సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నితీశ్, కిషోర్, అనిల్, ప్రణయ్, వైశాలి, సింధు తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నేతలు

హామీల అమలులో విఫలం

మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్

షాద్‌నగర: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. రైతులకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులందరూ సంతోషంగా ఉన్నారని, సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో గ్రామాల్లో హడావుడి చేసిన అధికార పార్టీ నేతలు పేదలకు ఎందుకు ఇంకా ఇళ్లు మంజూరు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పనులను చూసి ఆ పార్టీ నేతలే నవ్వుకుంటున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఓడించడం ఖాయ మన్నారు. కార్యక్రమంలో నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఈట గణేశ్, ఎమ్మె సత్యనారాయణ, లక్ష్మీనర్సింహా రెడ్డి, భీష్వ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లావణ్య

మున్సిపల్ ఛైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: యువజన సంఘాలు, నాయకుల సహకారంతో అభివృద్ధిలో మున్సిపాలిటీని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో స్థానిక నాయకులతో కలిసి ఆమె అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. సాధారణ నిధులు సుమారు రూ.5లక్షలతో డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో విడతల వారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా ప్రజలు, వ్యాపారులు పారిశుద్ధ్య నిర్వహణలో మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్, కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్లు ప్రసన్నలత యాదయ్య, కోస్గి శ్రీనివాస్, నాయకులు దేవేందర్‌యాదవ్, ఆల్విన్‌రెడ్డి, దిలీప్ రెడ్డి, లక్ష్మయ్య, రాజిరెడ్డి, గోపాల్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ సహజం



రాజు దంపతులను సన్మానినిస్తున్న ఎంపీడీఓ హిమబిందు, సిబ్బంది

ఎంపీడీఓ హిమబిందు

చేవెళ్ల: ఉద్యోగంలో చేరిన ప్రతీ ఉద్యోగికి విరమణ అనేది ముందుగానే నిర్ణయించబడుతుందని, పని చేసినన్ని రోజులు అందరి మన్ననలు పొంది మంచి ఉద్యోగిగా గుర్తింపు తెచ్చుకోవడమే ముఖ్యమని ఎంపీడీఓ హిమబిందు అన్నారు. చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేసిన ఎం.రాజు పదవీ విమరణ సందర్భంగా సోమవారం కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు దంపతులను కార్యాలయ అధికారులు, సిబ్బంది పంచాయతీ కార్యదర్శులందరూ కలిసి ఘనంగా సన్మానించి ఆయనకు వీడ్కోలు తెలిపారు. రాజు తన శేష జీవితం కుటుంబసభ్యులంతో కలిసి ఆనందంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవీందర్, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, శంకర్‌పల్లి ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ రమేశ్, సాయి, టైపిస్ట్ రాంచంద్రయ్య, సిబ్బంది గౌస్, శోభ, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంపూర్ణ జ్ఞానంతోనే మోక్షం

త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి అధ్యక్షురాలు సద్గుణ

షాద్‌నగర్‌రూరల్: సంపూర్ణ జ్ఞానాన్ని సంపాదించినప్పుడే ప్రతీ వ్యక్తికి మోక్షం లభిస్తుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి, ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షురాలు సద్గుణ అన్నారు. ఉత్తరాయణం, భోగి, సంక్రాంతి పండుగల విశిష్టతను తెలియజేసేందుకు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో సోమవారం ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గుణ మాట్లాడుతూ.. భగవద్గీత జ్ఞానం ప్రకారం క్రాంతి అంటే తిరుగుబాటు అని, సంక్రాంతి అంటే మనిషిలోని దుర్గుణాలపై తిరుగుబాటు అని సూచించారు. సుఖ, భోగ వాంఛలను అగ్నికి ఆహుతి చేయాలని, భోగి మంటలు అనే అగ్నిలో కోరికలు సకల కర్మలను కాల్చివేయాలని సూచించారు. కోరికలు, కర్మలు పూర్తిగా లేనట్లయితే ఉత్తరాయణం రోజు మోక్షంతో విముక్తి లభిస్తుందన్నారు. దక్షిణాయంలో చివరి రోజును భోగి పండుగ అంటారని, కర్మలు అనే కట్టెలు కాలిపోవాలనే సంకేతంతో భోగి రోజున కట్టెలను కాలుస్తారన్నారు. ప్రజలందరూ జ్ఞానులుగా, యోగులుగా మారి జ్ఞానాగ్నితో కర్మలను కాల్చుకోవాలని, ఈ సంక్రాంతి పండుగ అంతరార్థాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు కుల్దీప్‌రెడ్డి, ధన్వంతరి, సుధీర్, దినేశ్, శిరీష, వాసంతి, సాత్విక, నవ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

శుద్ధజలంతో ఆరోగ్యం పదిలం



ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న ఇబ్రహీం

టోల్‌ప్లాజా మేనేజర్ మహ్మద్ ఇబ్రహీం

షాద్‌నగర్‌రూరల్: ప్రతి రోజు శుద్ధజలాన్ని తీసుకొని ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాలని రాయికల్ టోల్‌ప్లాజా మేనేజర్ మహ్మద్ ఇబ్రహీం అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల గ్రామంలో జడ్చర్ల ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ లిమిటెడ్ రాయికల్ టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. ఈ ఆర్వో ప్లాంటును సోమవారం ఇబ్రహీం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నీటిశుద్ధి యంత్రాలు లేకపోవడంతో ప్రజలు బోరునీటిని తాగుతూ రోగాల బారిన పడుతున్నారన్నారు. పల్లెవాసులకు తాగేందుకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే ఆలోచనతో గ్రామంలో 2 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశామన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామస్తులు టోల్‌ప్లాజా యాజమాన్యానికి, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా అడ్మిన్ ఇన్‌చార్జి జగదీశ్, ఫైనాన్స్ మేనేజర్ శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.